క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

మంగొల్లు(వత్సవాయి): ప్రభుత్వం అందించే సాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను అన్నారు. గ్రామానికి చెందిన అప్పనబోయిన విజయ్‌కుమార్ గతేడాది ఖమ్మం జిల్లా వల్లభి గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తూ ఎన్ఎస్‌పీ కాలువలో పడి మరణించాడు. అతనికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.2 లక్షల చెక్కును శనివారం కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సామినేని లక్ష్మీనారాయణ, అన్నెపాక నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సమర్థంగా పనిచేయాలి



కె.పొన్నవరం(పెనుగంచిప్రోలు): ఉపాధి హామీ కూలీలు సమర్థంగా పనిచేయాలని ఎంపీపీ మార్కపూడి గాంధీ అన్నారు. ఆయన శనివారం మండల పరిధిలోని కె.పొన్నవరం గ్రామంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ఉన్నత ఆశయంతో ఈ పథకం నిర్వహిస్తోందన్నారు. పనిచేసిన వారికి వేతనం కూడా వెంటనే అందిస్తోందన్నారు. అడిగిన ప్రతివారికీ జాబ్‌కార్డు ఇచ్చి పని కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గయ్యపేట ట్రాఫిక్ ఎస్ఐగా శ్రీనివాసరావు



జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేటలో నూతనంగా ఏర్పాటుచేసిన ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు ఎస్ఐగా ఆర్.శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం చెరువుబజారు పర్యటనలో ఉన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభానును ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఉదయభాను ఆయనకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు రాఘవేంద్ర, ప్రభాకర్, నాయకులు తన్నీరు నాగేంద్ర, కాశి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజ్ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి

నందిగామ: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో డ్రైనేజీలు ప్రతిరోజు శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం సిబ్బందికి సూచించారు. పట్టణ పరిధిలోని మూడవ వార్డులో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను శనివారం ఆయన పరిశీలించారు. స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకోవడంతో పాటు పారిశుద్ధ్యానికి సంబంధించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో డ్రైనేజీలలో నీరు నిలబడకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. ముఖ్యంగా దోమల నివారణకు అవసరమైన మందులను పిచికారీ చేయడంతో పాటు నిల్వ ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్ వేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ షేక్ ఖాలిక్, పారిశుద్ధ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం

నందిగామటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.2.50 లక్షల విలువైన చెక్కులను స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వాలకు సాధ్యం కాని రీతిలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఇంటింటికీ మెరుగైన వైద్యమందిస్తున్నారని అన్నారు. పట్టణాలతో పాటు గ్రామాల్లో సైతం విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఆరోగ్యశ్రీకి సైతం పూర్వ వైభవం తీసుకురావటంతో పాటు కరోనాతో సహా 2,600కు పైగా జబ్బులకు ఉచిత వైద్యం అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లోపిస్తే సహించం

అనుమంచిపల్లి(జగ్గయ్యపేట): అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. గ్రామంలోని ఎస్సీ కాలనీ నుంచి గిన్నె చెరువు మీదుగా బలుసుపాడు, త్రిపురవరం జంక్షన్ వరకు రూ.కోటి వ్యయంతో నిర్మిస్తున్న రోడ్డు పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు గ్రామాల ప్రజలు ఈ రహదారి అభివృద్ధి కోసం ఎంతో ఎదురు చూస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపి చేతులు దులుపుకొన్నారని,ప్రస్తుత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో రోడ్డు పనులు చేపడుతున్నామని, త్వరగా పూర్తి చేసి ప్రజలకు వినియోగంలోకి తీసుకురానున్నట్లు తెలిపారు. సర్పంచ్ పానుగంటి లక్ష్మీత్రివేణి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యప్రాప్తిరస్తు!




దోలా వెంకటరమణ

ఈ ఫొటోలో కనిపిస్తున్న ఆమె పేరు డోలా వెంకటరమణ. కొళ్లికూళ్ల గ్రామం. కాలు విరిగి ఇంటికే పరిమితమైంది. తెలుసుకున్న వైద్యాధికారి ఇందిర ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా రోగి ఇంటికి వెళ్లి పరీక్షలు నిర్వహించి అత్యవసరంగా శస్త్రచికిత్స అవసరమని సూచించారు. అంబులెన్స్ ఏర్పాటు చేసి ఆసుపత్రికి పంపుతామని కూడా చెప్పటంతో ఆమె ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. గతంలో షుగర్, బీపీ మందుల కోసం ఎన్నో వ్యయ ప్రయాసలకు గురయ్యేదానినని, ఇప్పుడు మందులు ఇంటికి వచ్చి ఇస్తున్నారని సంతోషంగా చెప్పింది. వైద్యులతో పాటు ఇంటికి వచ్చిన ప్రజాప్రతినిధులు కూడా కాలి శస్త్రచికిత్సకు సహకరిస్తామని భరోసా కల్పించారని వారికి కృతజ్ఞతలు తెలియజేసింది.

- ఫ్యామిలీ డాక్టర్‌తో గ్రామీణులకు అత్యుత్తమ వైద్యం
- గ్రామాల్లో విస్తృతంగా వైద్య సేవలు
- నెలలో రెండుసార్లు ఇంటి వద్దనే వైద్య పరీక్షలు



రోగులకు వారి ఇంటి వద్దే పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి ఇందిర



పెనుగంచిప్రోలు: ప్రజలకు మెరుగైన వైద్య సంరక్షణ లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. ఇందులో భాగంగా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చింది. ఫ్యామిలీ డాక్టర్ విధానంతో గ్రామాల్లో ప్రజల ఇళ్ల వద్దకే వెళ్లి వైద్యం అందిస్తున్నారు. దీంతో తమకు వ్యయ ప్రయాసలు తప్పాయని గ్రామీణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మంచానికి పరిమితమైన వృద్ధులు, దివ్యాంగులు, ఆరోగ్యశ్రీ రోగులను పరామర్శిస్తూ ఇంటి వద్దనే సేవలందిస్తున్నారు. 14 రకాల పరీక్షలు, ఉచితంగా మందులు అందిస్తున్నారు. దీంతో పాటు మధ్యాహ్నం ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్నారు.

నాణ్యమైన వైద్యం అందుతోంది



నాకు గ్యాస్, నొప్పులు, నీరసం ఉంది. పెద్ద వయస్సు కావటంతో ఎక్కడకూ వెళ్లలేని పరిస్థితి. గ్రామానికి 104 వాహనం రావటం, వైద్యులు కూడా గ్రామానికి వస్తుండటంతో చాలా బాధ తప్పింది. ఉచితంగా పరీక్షలు చేయటంతో పాటు మందులు కూడా ఉచితంగా ఇస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మా కెంతో లాభంగా ఉంది.

–ఆదిమూలం వెంకటరత్నం, కొళ్లికూళ్ల

థైరాయిడ్ మందులు ఇస్తున్నారు



థైరాయిడ్‌కు వైద్యం కోసం నందిగామలో ఒక ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లేదాన్ని. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్యులే గ్రామానికి వచ్చి పరీక్షలు నిర్వహించటంతో పాటు 104 వాహనం ద్వారా ఉచితంగా మందులు ఇస్తున్నారు. దీంతో నాకు వ్యయప్రయాసలు తప్పాయి. జగనన్న ప్రభుత్వానికి రుణపడి ఉంటా.

–గొర్రెపాటి ప్రమీల, కె.పొన్నవరం

ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

నందిగామ కోర్టు 16వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసరావు



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాసరావు

కంచికచర్ల: విద్యార్థులు బాగా విద్యనభ్యసించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని, కన్న తల్లిదండ్రులు, పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని నందిగామ కోర్టు 16వ అదనపు జిల్లా న్యాయమూర్తి వి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక శ్రీ అక్షర జూనియర్ కళాశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నందిగామ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండి మల్లికార్జునరావు అధ్యక్షతన శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్ చేయరాదని, మైనర్లు వాహనాలు నడపరాదని అన్నారు. ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు వినాలని తెలిపారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఇంజినీరింగ్, వైద్య రంగాలకే కాకుండా అనేక రంగాలలో ఎన్నో అవకాశాలున్నాయని న్యాయ విద్యను కూడా అభ్యసించవచ్చని అన్నారు. సమాజంలో జరిగే మంచి పనుల్లో కూడా విద్యార్థులు చురుగ్గా పాల్గొనాలని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఈశ్వరప్రగడ రంగారావు, న్యాయవాదులు షేక్ ఆజాద్, జి.వెంకటరత్నం, జి.శ్రీనివాసరావు, ఎస్ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం, శ్రీ అక్షర కళాశాల కరస్పాండెంట్ కాసరగడ్డ రామారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

ప్రభుత్వ విప్ ఉదయభాను



చెరువు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేటను జిల్లాలో మేలైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషిచేస్తున్నట్టు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. అందుకోసం జగ్గయ్యపేట ఊర చెరువును హైదరాబాద్‌లో ట్యాంక్‌బండ్, ఖమ్మంలో లకారం మాదిరిగా సుమారు రూ.10 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా శనివారం చెరువు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఊరచెరువునంతా ప్రక్షాళన చేసి సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. చెరువు చుట్టూ గ్రీనరీ, వాకింగ్ ట్రాక్, లైటింగ్, బోటు షికారు, ఓపెన్ జిమ్‌లు తదితర హంగులతో అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించే విధంగా తయారు చేయనున్నట్లు తెలిపారు. చెరువు అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. రూ.35 లక్షల వ్యయంతో చెరువు అలుగు వద్ద చేపట్టిన వంతెన నిర్మాణ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయన్నారు. ఈ నిర్మాణాల పనులను కంట్రాక్టర్లు సకాలంలో పూర్తిచేయాలని, నాణ్యతా ప్రమాణాలను పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, వైఎస్సార్ సీపీ నాయకులు తన్నీరు నాగేంద్ర, కాశి కిషోర్, దువ్వల రామకృష్ణ, పాటి సాంబ, తాళ్లూరి వెంకటేశ్వర్లు, వేముల విజయ్, తాళ్లూరి శివ పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల్లో నాణ్యత పాటించాలి



వేదాద్రిలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈవో చిట్టిబాబు

జగ్గయ్యపేట: ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంఈవో చిట్టిబాబు అన్నారు. మండలంలోని గుండబోయినపాలెం, పోచంపల్లి, వేదాద్రి గ్రామాల్లోని పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పనులు నిర్వహిస్తుందన్నారు. పనుల్లో నాణ్యతతో పాటు సకాలంలో పనులు పూర్తి చేయాలని తెలిపారు. పోచంపల్లి, గుండబోయినపాలెం గ్రామాల్లో పనులు వెనుకబడి ఉన్నాయని, వేగవంతం చేయాలని ప్రధానోపాధ్యాయుడు తదితరులను కోరారు. పనుల్లో నాణ్యత లేకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అనంతరం వేదాద్రిలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

నవరసాల దృశ్యకావ్యం దేవదాసు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కొల్లూరి, దోగిపర్తి, అక్కినేని అభిమాన సంఘం ప్రతినిధులు

విజయవాడకల్చరల్: అక్కినేని నాగేశ్వరరావు, సావిత్రి నటజీవితంలో చిరస్థాయిగా నిలిచిపోయిన చలనచిత్రం దేవదాసు అని ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి అన్నారు. దేవదాసు చిత్రం విడుదలై 70 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ, శారదా కళాసమితి, మన అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. శారదా కళాసమితి అధ్యక్షుడు డోగిపర్తి శంకర్రావు మాట్లాడుతూ దేవదాసు చిత్రం తెలుగు సినిమా చరిత్రలో క్లాసిక్‌గా నిలిచిపోయిందన్నారు. మన అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు ఎం.రామకృష్ణ, సంస్థ లక్ష్యాలను వివరించారు. అక్కినేని అభిమాన సంఘం నాయకులు పురాణం రమణ, కేవీఎస్ సత్యనారాయణ, మిరియాల ఏడుకొండలు, సుకుమార్‌రెడ్డి, జి.సూర్యనారాయణ పాల్గొన్నారు. అక్కినేని జీవిత సాఫల్య పురస్కారాన్ని జి.ప్రసాద్‌కు అందజేశారు. దేవదాస్ చిత్రంపై క్విజ్ పోటీ నిర్వహించారు. దేవదాసు 70 ఏళ్ల బ్రోచర్‌ను కొల్లూరితో పాటు అతిథులు ఆవిష్కరించారు.

అర్హులందరికీ లబ్ధి చేకూర్చేందుకే జగనన్న సురక్ష

పెనుగంచిప్రోలు: అర్హత ఉన్న ప్రతి వ్యక్తికీ లబ్ధి చేకూర్చేందుకే ప్రభుత్వం జగనన్న సురక్ష పథకం ప్రారంభించిందని తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి తెలిపారు. స్థానిక సచివాలయ ఆవరణలో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి ఆధ్వర్యంలో శనివారం వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, గృహసారథుల కన్వీనర్లతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ ఒక్కరు కూడా ప్రభుత్వం నుంచి వస్తున్న లబ్ధిని కోల్పోకూడదనేది ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశమన్నారు. సర్పంచ్ పద్మకుమారి మాట్లాడుతూ అందరూ సమర్థంగా పనిచేసి పథకాలు అందరికీ అందేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్యామ్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వేల్పుల రవికుమార్, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, ఉపసర్పంచ్ బాడిశ పాపారావు, సచివాలయాల మండల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవు



నందిగామ: వాహన చోదకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని పట్టణ సీఐ హనీష్ అన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం సాయంత్రం ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. లైసెన్స్ లేకుండా, వాహనాలకు నంబర్ ప్లేట్లు లేకుండా, అతి వేగంగా వెళుతున్న, ట్రిపుల్ రైడ్ చేస్తున్న, మైనర్లు నడుపుతున్న పలు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనం నడిపే టప్పుడు తప్పనిసరిగా లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను దగ్గర ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. కొందరు మైనర్లకు వాహనాలు ఇస్తున్నారని, ఆ విధంగా ఇవ్వడం వలన ప్రమాదాలు జరిగే అవకాశముందన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పలు వాహనాలకు జరిమానాలు విధించారు. ఈ తనిఖీలలో ఎస్ఐలు పండుదొర, సోమేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి



ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభిస్తున్న సర్పంచ్ దుర్గాదేవి

నరసింహారావుపాలెం(వీరులపాడు): మహిళల ఆర్థిక స్వావలంబనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని సర్పంచ్ బొమ్మిశెట్టి దుర్గాదేవి అన్నారు. మండలంలోని నరసింహారావుపాలెం గ్రామంలో ఏర్పాటు చేస్తున్న ఉచిత కుట్టు మిషన్ కేంద్రాన్ని శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు చేతివృత్తులు ఎంతో దోహదపడతాయన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సైతం మహిళలకు అండగా ఉంటూ వారి ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి ముప్పాళ్ల కోటేశ్వరరావు, గ్రామ పెద్దలు పసుపులేటి వెంకటేశ్వర్లు, తల్లపురెడ్డి శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

‘జగనన్న సురక్ష ’ సద్వినియోగం చేసుకోవాలి

ఆర్డీవో రవీంద్రరావు



అడవిరావులపాడులో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీవో, పలువురు అధికారులు



ఒకటవ వార్డులో సిబ్బందికి సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్ జయరాం

నందిగామ: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో ఎ.రవీంద్రరావు సూచించారు. మండలంలోని రావులపాడు గ్రామంలో జరుగుతున్న జగనన్న సురక్ష స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. గ్రామంలోని పలు ఇళ్ల వద్దకు వెళ్లి స్థానికులతో మాట్లాడడంతో పాటు జగనన్న సురక్ష కార్యక్రమంపై వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాలు, సేవలు అందాలన్న లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ప్రతి గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు పూర్తి వివరాలు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాసరావు, డెప్యూటీ తహసీల్దార్ రిబ్కారాణి, గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణంలో మున్సిపల్ కమిషనర్ పర్యటన

పట్టణ పరిధిలో జరుగుతున్న జగనన్న సురక్ష స్పెషల్ క్యాంపెయిన్ ను శనివారం మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం పరిశీలించారు. పట్టణంలోని ఒకటవ సచివాలయ పరిధిలో పలు ఇళ్లకు పర్యటించి స్వయంగా స్థానికులతో మాట్లాడి జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించిన వివరాలను కమిషనర్ తెలియజేశారు. ఆయన వెంట పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ మంచి చేస్తున్న ప్రభుత్వం

- ఎమ్మెల్సీ డాక్టర్ అరుణ్‌కుమార్
- జగనన్న సురక్ష కార్యక్రమంపై అధికారులు, ప్రజా ప్రతినిధులు, వలంటీర్లతో సమావేశం



కంచికచర్లలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్

కంచికచర్ల: రాష్ట్రంలో శాచ్యురేషన్(సంతృప్తస్థాయి) పద్ధతిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం మంచి చేస్తుందని, అర్హత ఉండీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధి పొందకుండా మిగిలిపోకూడదనేదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తపన అని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ప్రజా ప్రతినిధులు, అధికారులు, వలంటీర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి ఇంటికీ వెళ్లి మరీ సమస్యలు ఏమైనా ఉంటే తెలుసుకుని పరిష్కారం చూపించే దిశగా చేస్తున్న వినూత్న కార్యక్రమం అన్నారు. కుల, మత, పార్టీల కతీతంగా ఇంకా మిగిలిపోయిన వారికి కూడా సంక్షేమ పథకాలు అందాలని జగనన్న సురక్ష ద్వారా ఇంటింటినీ జల్లెడ పట్టి మరీ వారికి లబ్ధి అందించేలా ఇంకా ఎవరికైనా సర్టిఫికెట్లు అవసరమైతే జనన, మరణ, కుల, ఆదాయ, సీసీఆర్‌సీ కార్డులు, రేషన్ కార్డు డివిజన్, హౌస్ హోల్డ్ డివిజన్ మొదలైన 11 రకాలు సర్వీస్ ఫీజు లేకుండా ఉచితంగా వారికి అందజేస్తామన్నారు. అనంతరం ప్రజాప్రతినిధులు ఎమ్మెల్సీని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, సర్పంచి వేల్పుల సునీత, ఎంపీటీసీ సభ్యులు నన్నపనేని నరసింహారావు, మాడుగుల మధుబాబు, వేమా రోజారమణి, బండారుపల్లి నాగలక్ష్మి, ఉప సర్పంచి వేమా సురేష్‌బాబు, సొసైటీ అధ్యక్షుడు కాలవ పెదబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు కాలవ వాసుదేవరావు, శేషం వాసుబాబు, చింతా రవీంద్రనాథ్, మార్త శ్రీనివాసరావు, వేల్పుల శ్రీనివాసరావు, దేవరకొండ గురవయ్య, పాండు, నారిశెట్టి శ్రీనివాసరావు, నాయక్, వలంటీర్లు, గృహసారథులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జగనన్న పాలన చూసే పార్టీలో చేరికలు

ప్రభుత్వ విప్ ఉదయభాను



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేటఅర్బన్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమర్థమైన పాలనను చూసి వైఎస్సార్ సీపీలోకి పెద్దఎత్తున చేరుతున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. స్థానిక బి.కన్వెన్షన్ హాల్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో పేట మండలంలోని చిల్లకల్లు గ్రామంలో బీసీ కాలనీకి చెందిన గుంజ భిక్షం, గుంజ నరసింహారావు, గుంజ పుల్లారావు, పల్లపు నరసింహారాజు తమ కుటుంబాలతో కలిసి టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి ఎమ్మెల్యే ఉదయభాను సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే ఉదయభాను పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ముత్తినేని విజయశేఖర్, గ్రామానికి చెందిన రూపన పుల్లయ్య, మాతంగి నాగబాబు, ఉత్తపల్లి వెంకటేశ్వర్లు, గుంజ తిరుపతిరావు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు సీఎం కృషి

గడపగడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



పొన్నవరం గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

పొన్నవరం(వీరులపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదరిక నిర్మూలనకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని పొన్నవరం గ్రామంలో శనివారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించి సంక్షేమ పథకాల అమలు తేదీలతో కూడిన క్యాలెండర్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ అన్ని రంగాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతో పాటు అగ్రవర్ణ మహిళలకు సైతం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్నారని తెలిపారు. గత ప్రభుత పాలనలో గ్రామీణ ప్రాంతాలు కనీస అభివృద్ధికి నోచుకోలేదని, జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే సచివాలయ భవనాలతో పాటు రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, తదితర అభివృద్ధి పనులు చేపడుతూ గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. ప్రజలకు అన్ని రకాలుగా మంచి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా ఉండి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ షోడగిరి రాజశ్రీ, ఎంపీటీసీ సభ్యుడు శీలం రమణారెడ్డి, సొసైటీ చైర్మన్ జ్ఞానరెడ్డి, షోడగిరి సతీష్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్‌లు పాల్గొన్నారు.